ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


పాఠశాల హెచ్ఎంతో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

లక్ష్మీపురం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశించే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ కె.ఎఫ్. కెనడీ తెలిపారు. తెలగాయపాలెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండే విలువలతో కూడిన నాణ్యమైన గుణాత్మక విద్యతో పాటు క్రమశిక్షణను అలవాటు చేయాలని చెప్పారు. అనంతరం పాఠశాలలోని రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం షహనాజ్ బేగం, సీఆర్పీలు జమాయమ్మ, సురేంద్ర, చలపతిరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వంద శాతం పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య


రోడ్డును వృద్ధుడితో కలసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలారి

చేబ్రోలు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గొడపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాల్ని వివరించడంతో పాటు సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల్ని నూరు శాతం పరిష్కరించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాలకు మంజూరైన నిధులతో పాటు ప్రత్యేక నిధులతో గ్రామాభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థానికంగా తెలియజేసిన సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా 423 ఇళ్లను పర్యటించి వారికి ప్రభుత్వ లబ్ధిని తెలియజేశారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

పంచాయతీ నిధులు రూ.1.30లక్షలతో నిర్మించిన గొడపాలెంలోని వడ్లమూడి జయపాల్ గ్రావెల్ రోడ్డును ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సోమవారం స్థానిక వృద్ధుడితో కలసి ప్రారంభించారు. అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె. సాహితి, నాయకులు షేక్ జానీ, అహ్మద్, పెద మస్తాన్, ఆరేపల్లి శివాజీ, చింతా రమేష్, గోపి, కె. మాణిక్యమ్మ, తలకాల మస్తాన్, ఉయ్యూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటిన చలపతి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి సాంకేతిక నైపుణ్యాల్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తును పొందాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. వివిధ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల వట్టిచెరుకూరు మండలం మలినేని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సంస్కృతి- 2023 ఫెస్ట్‌లో కళాశాలకు చెందిన ఏ. జ్యోత్స్న, శ్రీదేవి, వెంకటపద్మావతి ఐడియాథాన్ 1.0 పోటీల్లో ద్వితీయ స్థానం పొందినట్లు చెప్పారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బెక్టాగాన్ 2323 ఫెస్ట్‌లో కళాశాలకు చెందిన ఎం.ఎస్. మంజునాథ, షేక్ అష్రఫ్, ఈశ్వర్ షార్ట్ ఫిలిం మేగింగ్‌లో మొదటి స్థానం, టెక్నికల్ పీపీటీలో వెంకట వికాస్, కల్యాణ్ ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. విద్యార్థుల్ని వైస్ ప్రిన్సిపాల్ కె. కిరణ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గొర్రె ప్రదీప్‌కు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక, సూరత్‌కల్ పీహెచ్‌డీ అందించినట్లు వీసీ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. '' డిజైన్ అండ్ పెర్ఫార్మెన్స్ అనాలిసిస్ ఆఫ్ ఆప్టికల్ ఫ్రంట్ ఎండ్ ఆంప్లిఫైర్స్ యూజింగ్ నానో స్కేల్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్'' అనే అంశంపై ప్రదీప్ పరిశోధన చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 10 ఎస్సీఐ, రెండు బుక్ చాప్టర్స్, రెండు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేసినట్లు వీసీ వివరించారు.

వాస్తవిక దృక్పథం, తపనతోనే లక్ష్య సాధన

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి వాస్తవిక దృక్పథాన్ని కలిగి లక్ష్యసాధన దిశగా కృషిచేయాలని భవిష్యత్ ప్రణాళికల సలహాదారుడు జి.ఎస్. ప్రసాద్ తెలిపారు. నగర శివారు లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో సోమవారం భవిష్యత్, లక్ష్యాలు, సాధనపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భవిష్యత్ ప్రణాళికల్ని సక్రమంగా ఏర్పరచుకుని లక్ష్యసాధన దిశగా కృషిచేయాలని సూచించారు. ప్రతి రోజు ఒక నూతన విషయాన్ని నేర్చుకోవాలనే తపన ఉండాలని చెప్పారు. కష్టాన్ని ఇష్టంగా తీసుకుని కృషిచేస్తే భవిష్యత్ సంతోషంగా గడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. రామారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: నడిచి వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొనటంతో మృతి చెందిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. లాలుపురం గ్రామానికి చెందిన గోర్రె మోజెస్(40) మిర్చి యార్డు వై. జంక్షన్ వద్ద ఓ ఫంక్షన్ హాలులో వాచ్‌మేన్‌గా పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి టిఫిన్ చేసేందుకు వై.జంక్షన్ వద్దకు వచ్చి తిరిగి వెళుతుండా చిలకలూరిపేట వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుంటూరు రూరల్: పొలంలో అపస్మారకస్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వృద్ధుడు తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అడవితక్కెళ్లపాడులోని పొలాల వద్ద గుర్తు తెలియని సుమారు 60 సంవత్సరాల వయస్సుగల వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని గ్రామ సెక్రటరీ కిరణ్‌కు సమాచారం అందడంతో ఆయన అక్కడకు వెళ్లారు. స్పృహతప్పి పడిపోయిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 ద్వారా జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లోగానీ లేదా 8309369916 నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాసరావు కోరారు.

వివాహిత అదృశ్యం

గుంటూరు రూరల్: వివాహిత అదృశ్యంపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన అంకె భరత్ భార్య శివపార్వతి గుంటూరు నగర శివారుల్లోని హోసన్నా మందిర్ వద్ద జరిగే గుడారాల పండుగకు తన ఊరివారితో కలసి ఈనెల 3న వచ్చింది. ప్రార్థనలు జరుగుతున్న సమయంలో తనకు నీరసంగా ఉందని, జ్యూస్ తాగి వస్తానని తనతోపాటు వచ్చిన వారికి చెప్పి బయటకు వచ్చింది. అనంతరం తిరిగి రాలేదు. భర్తతో పాటు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితంలేక పోవడంతో పోలీసుల్ని ఆశ్రయించారు.

మత్తుకు బానిసగా మారితే జీవితాలు చిత్తు

పెదకాకాని: మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు చిత్తు అవుతాయని చైల్డ్‌లైన్ సెంటర్ కో-ఆర్డినేటర్ సమీర్‌కుమార్ తెలిపారు. ఉప్పలపాడు జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు సోమవారం చైల్డ్‌రైట్స్ అడ్వొకేసీ ఆధ్వర్యంలో మంచి అలవాట్లు సంపూర్ణ ఆరోగ్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం కౌమార బాలల బాధ్యత అనే అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతారని తెలిపారు. ఒక్కసారి దీనికి బానిసలైన తరువాత ఎంతటి నేరాలు చేయడానికైనా వెనకాడరని, బంగారు భవిష్యత్ సర్వనాశనం అవుతుందని వివరించారు. ఎవరైనా బాలలకు మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు, వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీస్ హెల్ప్‌లైన్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి తెలియజేయాలని ఆయన సూచించారు.

కనుల పండువగా అగస్తేశ్వరస్వామి కల్యాణం

గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ఎదురుకోలు ఉత్సవాన్ని నిర్వహించారు. రాత్రి దివ్య కల్యాణ మహోత్సవం, నిత్య హోమం, బలిహరణ కార్యక్రమాల్ని నిర్వహించినట్లు ఆలయ కార్యదర్శి సాయి విశ్వనాథ్, అర్చకుడు పవన్‌కుమార్‌శర్మ తెలిపారు. మంగళవారం స్వామికి తలంబ్రాల సేవతో పాటు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు

రైతులకు ప్రయోజనకరంగా కోల్డ్ స్టోరేజీలు

జిల్లావ్యాప్తంగా 120కి పైగా సేవలు

కొరిటిపాడు(గుంటూరు): గతంలో పంటల్ని నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాల్ని చవి చూసేవారు. చేసేది లేక ఇళ్లల్లో, పొలాల్లోనూ జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అక్కడ దాచిన పంట కీటకాలు, ఇతరత్రా మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అనేక అవస్థల్ని ఎదుర్కొనే వారు. క్రమేణా రైతులు ఆ బాధలు నుంచి బయటపడ్డారు. చేలో పంట ఏవిధంగా ఉందో.. నెలలు గడిచినా, అమ్మే వరకు శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజీ) భద్రంగా దాచేందుకు సిద్ధంగా ఉన్నాయి. గుంటూరు జిల్లాలో సుమారు 120కి పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 82 శీతల గిడ్డంగులు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

నాణ్యమైన సౌకర్యాలు

శీతల గిడ్డంగుల్లో గుంటూరు జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోని రైతులు సరుకు భద్రపరుచుకునేందుకు యజమానులు నాణ్యమైన సౌకర్యాలు కల్పించారు. విశాలమైన గదులు, లిఫ్ట్, రైతులు బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు, తక్కువ ధరలకే బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతో పాటు కర్నూలు, అనంతపురం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి రైతులు మిర్చిని విక్రయించుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగుల్ని ఆశ్రయిస్తుంటారు. వారి రాకతో గిడ్డంగులు నిండుకుండలా మారుతున్నాయి. చాలా గిడ్డంగుల్లో యజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొందరైతే ఏకంగా రైతులకు రుణాలు సైతం ఇప్పిస్తున్నారు. ఈ సౌకర్యం రైతులకు లాభదాయకంగా మారింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకి తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయినా వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికి తోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణ బేషుగ్గా నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 డిగ్రీల వరకు నిర్వహిస్తుండటంతో పంట చెక్కు చెదరడం లేదు.

తక్కువ ధరలకే నిల్వ సౌకర్యం

రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాల్ని పాటిస్తున్నాం.

–తడకమళ్ల సూర్యప్రకాశరావు,
ది కోల్డ్‌స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ప్రమాదవశాత్తు వ్యక్తి కిందపడి మృతి

గుంటూరు ఈస్ట్: ప్రమాదవశాత్తు వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మారుతీనగర్ 5వ లైనుకు చెందిన చెరుకూరి వెంకటేశ్వర్లు డ్రైవింగ్ స్కూల్ నడుపుతుంటాడు. అపార్టుమెంట్‌లోని తన ఫ్లాట్‌లోకి వెళ్లి శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు కిటిలో నుంచి కిందపడ్డాడు. వాచ్‌మెన్ సమాచారంతో అతని భార్య రమాదేవి ఘటనా స్థలానికి వెళ్లి భర్తను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.